



# తోడబుట్టిన...

– అడివి సూర్యకుమారి

వృద్ధకన్య... వృద్ధకన్య

అప్హ్హహ్హా.. నవ్వులు.. పగలబడి నవ్వుతున్నారు.

"యోగ్యతగా మాట్లాడ లేనపుడు, తక్కువగా మాట్లా డ్డమే ఓ యోగ్యతౌతుందిరా"

వడివడిగా తన గదిలో కొచ్చి పడింది జానకి.

"చూశావామ్మా ఆ పొగరు! తనే సంపాదిస్తోం దన్న అహంకారం"

పెద్ద తమ్ముడు కిషోర్ కామెంటది.

"నాకు రెండొందలి మ్మంటే లేవంది. స్నేహితు రాలి కూతురు పెద్దమనిషైం దని, గిఫ్ట్ కొంది వంద రూపాయలు పెట్టి. ఇందాక సెంటర్లోంచి వెళ్తూంటే చూశా. ఆ జరీచర, పూలు... ఛ... నా నోటితో అనకూడదు గాని... అట్లా వెళ్తోంది"

"ఛీ...ఛీ... ఏమ్మాటల్రా. అవి! నీకంటె పెద్దది,తోడబుట్టిన దాన్ని అనాల్సిన మాటలేనా! నోర్మూసుకో! మీనాన్న వింటే చీరేస్తారు" అంది పార్వతమ్మ నొచ్చుకుంటూ.

"వింటున్నా. నీ సుపుత్రుడంటున్న దౌర్భాగ్యపు మాటలన్నీ వింటున్నా. ఆడపిల్ల ఈ ఇంటి బాధ్య తంతా నెత్తి నేసుకొని మగపిల్లాడిలా ఈడ్చుకొస్తోంది. మగపిల్లాడు పెళ్ళి చేసుకొని పిల్లల్ని కంటూ ఉద్యోగం లేకుండా రోడ్లంట తిరుగుతున్నవాడు ఒకడైతే, నాటకాల పిచ్చిలో చదువుకూడా పాడు చేసుకుంటు న్న వాడొకడు. ఈ మనుషుల కెప్పుడు జ్ఞానం వస్తుందో! పైగా దాన్నంటున్నావురా! పురుగులు పడ్తావ్!"

"విప్పాడు భారతం..." అన్నాడు కిషోర్.

కాత్యా దొడ్లో నుండి జడవేస్తున్న కూతుర్ని అలాగే లాక్కుని వచ్చి కోపంగా అత్తగార్ని చూస్తూ-

"మామగారికి ఏళ్ళు పైబడి ఆయన ఏమ్మాట్లా డ్తోందీ తెలీటం లేదు. ఆయనేం ఊరికే తింటు న్నారా? ట్యూషన్లు చెప్పి సంపాదించటం లేదూ! కాస్త నోరు అదుపులో పెట్టుకోమనండి మీ కూతుర్ని. యోగ్యత లేంది ఎవరికిట. తనకా! నా మొగుడుకా! వచ్చిన సంబంధాలన్నీ వద్దని కూర్చుందెవరట? ముసలిదాన్ని ముసలిది అనక పడుచుదంటారా! వృద్ధకన్య అంటే తప్పేంటిట? సిగ్గులేక ఇంకా ఆయన్నంటోంది"

పార్వతమ్మ కోడలి దగ్గరికొచ్చి "కాత్యా! నువ్వూరుకో! ఏమిటా మాటలు! పెద్ద చిన్న లేకుండా!" అంది

"అనండి మరి. మీకు కూతురే ముఖ్యం. కొడుకు కోడలు అవమానాల పాలైనా, తిట్లుతిన్నా మీ కానందమే. అసలు ఒకర్నని ఏం లాభం? అంతా నా ఖర్మ? ఉద్యోగం లేని మొగుణ్ణి చేసుకోటం నాదే తప్పు. ఛ... నా బతుకింత తేలికైపోయింది."

కాత్యా ముక్కు చీది, పిల్ల నెత్తినొరెండు మొట్టి 'పదవే ముదరష్టమా?' అని తిట్టి, లోపలికెళ్ళి పోయింది.

కిషోర్ కోపంగా తల్లి వైపు చూసి "ఛీ... ఈ కొంపలో వుండేకంటే ఎక్కడైనా పోయి చావటం నయం" విసురుగా వెళ్ళిపోతూ అన్నాడు.

ఆ రాత్రి జానకి భోజనం వద్దని తలుపు గడియ పెట్టేసుకొంది. తల్లి ఓసారి వచ్చి పిలిచి వెళ్ళింది.

అంతా భోజనాలు చేస్తున్నట్లుంది.

"జానకేది?" తండ్రి అడుగుతున్నాడు.

"ఆకలి లేదని పడుకొంది" తల్లి జవాబు.

"ఏం ఫర్వాలేదు. స్నేహితురాలింట్లో ఫంక్షన్‌గదా! ఏదో తినే వచ్చుంటుందిలే." చిన్నతమ్ముడు సవరణ.

"అయినా నువ్వలా దాన్ననటం బాగాలేదురా!" తండ్రి మందలించకుండా మెత్తగా అంటున్నాడు.

"ఎందుకూరుకోవాలి! పెద్ద తనే సంపాదిస్తున్నానని ఎంత పొగరో! నాన్నగారు సంపాదించినపుడు ఇలాగే అనేవారా? ఏం మా సౌక ర్యాల కోసం ఆవిడ జీవితం ఏం త్యాగం చేసిందిట? ఎక్స్‌కర్షన్‌కి ఐదొందలి మ్మంటే ఇవ్వలేదు. మంచి ప్యాంటు కొనుక్కుందా మంటే గతిలేదు. ఏమిటా విడ బోడి సంపాదన! తను మాత్రం కొత్త చీరలు కట్టు కొని టింగురంగా అని తిరు గుతుంది వృద్ధకన్యలా" చిన్నవాడలా అంటుంటే గడప దగ్గర నిలబడ్డ కాత్యాయనితో సహా అంతా నవ్వారా మాటలకి.

"నోర్మూనుకోండిరా! వినపడతాయ్ దానికి! రమకి సీమంతం చెయ్యాలి. ఖర్చుకి నాల్గువంద లిమ్మంటే రెం డొందలిచ్చింది, ఇవే మూలకి కబురు!" అంటోంది పార్వతమ్మ

"ఆర్నెల్లుగా అడుగుతున్నా గార్డెన్ వరెలీ చీరెకొని పెట్టమని... ముష్టి మూడొందలు ఇవ్వడానికి ఏడు స్తుంది" చిన్న చెల్లెలు ఫిర్యాదు.

అన్నీ విన్పిస్తున్నాయి జానక్కి.. తనవైపు చూసు కొంది వెలిసి పోయిన చీరె. చేతికింద చిరిగిన జాకెట్టు. మెల్లగా నడిచి అద్దం ముందు నిలబడింది.

"తను వృద్ధకన్యా! తనప్పుడే ముసలిదై పోయిందా?" 'నిజమే'నన్నట్లు పాపిడి పక్కగా నాల్గు తెల్ల వెంట్రుకలు నిలబడ్డాయి. వాటిని కసిగా పీకేసింది.

"తనొక్కర్తికి గది దేనికో! మొగుడా! మొద్దులా! నడవలో చాపేసుకొని పడుకోక! పరుపూ మంచం ఓ యబ్బ" అంటోంది తమ్ముడి భార్య.

కిటికీ తలుపేసింది జానకి.

ఔను! తన కెందుకు పెళ్ళి కాలేదు? తనెందు కిలా వృద్ధకన్యలా వుండిపోయింది! సంబంధాలు రాకనా! పెళ్ళి చేసుకోవటం తనకిష్టం లేకనా! తను వికారా! బామ్మ బతికున్నంతకాలం అంటుండేది "పసిడి బొమ్మ నా మనవరాలు. ఎవడో ఎక్కడో బంగారు పూల పూజ చేస్తూంటాడు" ఒళ్ళో కూర్చో బెట్టుకుంటూ అనేది.

తను బి.ఎ పాసైంది. ఏక్సిడెంట్‌లో నాన్న కాలు పోయి, ఉద్యోగం పోయింది. కంపెనీ వారిచ్చిన డబ్బుతో తన పెళ్ళి చెయ్యాలనుకున్నారు నాన్న . అప్పుడు తనకో సంబంధం వచ్చింది. తనే పెళ్ళి చూపులక్కూడా ఇష్ట పడలేదు.

కాలు పోయిన నాన్న ఓ పక్క, ఇంటర్‌లో ఉన్న పెద్ద తమ్ముడు, టెన్త్ పాసై కాలేజీలో చేరాలం

టున్న పెద్ద చెల్లెలు, హైస్కూల్లో చదువుతున్న చిన్న తమ్ముడు చిన్న చెల్లెలు, వీళ్ళనిలా గాలి కొదిలేసి తనదారి తను చూసుకుంటే ఎలా?

కంపెనీ వారిచ్చిన డబ్బుతో అమ్మ ఇష్ట ప్రకారం ఇల్లు కొనుక్కున్నారు. బి.ఇ డి. చేసి ఉద్యోగంలో చేరింది. తను మొదటి నెల జీతం నాన్న చేతికివ్వగానే ఆయన కళ్ళు ఆనందంతో నిండాయి.

"నాకు నువ్వు కొడుకువి తల్లీ! కూతురివి కాదు" అని భార్యవైపు చూసి

"చూశావా! ఆడపిల్ల పుట్టిందని ఆరోజు బాధ పడ్డావ్, చూడు! ఈ రోజు నా కన్న తల్లి నా బాధ్యత తను తీసుకొంది" అన్నారాయన కంఠం వణుకుతూంటే.

"ఊర్కోండి నాన్నా! మీరు మరీను. ఇది నా కర్తవ్యం అంతే"

ఆ రోజు నుండి 'తన కర్తవ్యం' అనుకుంటూనే చెల్లెలి పెళ్ళి తమ్ముళ్ళ చదువులు పూర్తయ్యాయి. పెద్ద చెల్లెలి పెళ్ళిలో అడిగారు.

"పెద్దమ్మాయి నలాగే ఉంచారేం?" అని.

"ఏం చెయ్యమండీ! పిల్లా, ఎం.ఏ. చదివింది ఈమధ్యనే లెక్చరర్ అయింది. దానికంటె పెద్ద చదువు చదివిన వాడు కావాలిగా. చూస్తూ చూస్తూ ఏ బి.ఎ. వాడికో ఇవ్వలేంగా! చూస్తున్నాం. కట్నాలు ఎలా మండుతున్నాయో మీకు తెలీదా?" అంది తల్లి.

పెద్ద తమ్ముడి పెళ్ళప్పుడు ఇదే చర్చ కొచ్చింది.

"ఏ చేస్తాం! దానికా కల్యాణ ఘడియారా లేదింకా! పెళ్ళి మాటెత్తితే కస్సుమంటుంది. ఏ సంబంధమూ నచ్చదు" అంటోంది తల్లి, పెళ్ళి వారి బంధవుల్తో.

తను కస్సుమందా! తన దగ్గర అసలు ఆ ప్రస్తావన తెచ్చిందెవరు?

తల్లి ఇచ్చిన జవాబు విని జాలిగా నవ్వు కొంది జానకి.

"ఏమే కోడలా! నీకంటికి నచ్చిన మన్మధుడింకా తటస్థ పడలేదా! నువ్వీలోపున ముసలి దానివైతే నిన్నెవరు చేసుకుంటారే?" వరసైన ఓ అత్త ఛలోక్తి

'చలపతి కూతురు మగపిల్లల్నెంచు తోందిట!' అన్న అపప్రధ తనకి స్థిరపడింది.

వచ్చిన నాలుగైదు సంబంధాల్ని ఏదో సాకుతో పంపించారే గాని... తన దాకా ఎవరొచ్చారని?

ఓ రోజు దూరపు బంధ వొకాయన సంబంధం తీసుకొచ్చాడు.

"చాల్లే ఊర్కోండి! ఈ వయసులో దానికి పెళ్ళేమిటి? నలభయ్యో పడిలో పడ్తూంటే... లేని పోని ఆలోచనలు దాని మనసు కెక్కించకండి"

తల్లి గద్దింపు అది. వచ్చినతను వెళ్ళిపోయాడు.

"అంతగా ముచ్చట పడితే... మా నానీని పెంచుకో మనండి. పిల్లాడు నా దగ్గరే ఉండాలి" కాత్యాయని జాలిపడి ఇచ్చిన బహుమతి అది.

"దాని సంపాదన మనకాక్క ఎవరికి! పిచ్చి మాటలు మాట్లాడకు" కిషోర్ కసిరాడు భార్యని, కొడుకుని దగ్గరికి తీసుకుంటూ.

సాయంకాలం పేరంటమయ్యాక - లలిత తనని డాబా మీదికి తీస్కెళ్ళింది. ఆ మాట ఈ మాట మాట్లాడాక,

"నీ అంత మూర్ఖురాల్ని, అమాయకురాల్ని నేనెక్కడా చూళ్ళేదు. ఇప్పటికైనా మించి పోయింది లేదు. పెళ్ళి చేసుకో! నీ కంటూ ఓ తోడుండాలి. నీ మనసుకి ఓ స్వాంతన అవసరమౌతుంది. నువ్వు కావాలనుకొనే నీ సుఖం, నీ ఆనందం నీ సంతోషం, తనవిగా భావించి, నీతో కలిసి జీవించే ఓ మనసున్న మనిషి నీ క్కావాలి. అది నువ్వింకా తెలుసుకోలేక పోతున్నావ్. పెద్ద చదువులు చదివావ్! ఉద్యోగం చేస్తున్నావ్! సంపాదించి పోస్తున్నావ్! నీకేం మిగిలింది?"

"నా బాధ్యత నేను నిర్వర్తించానన్న తృప్తి"

"అది నీ ఒంటరితనాన్ని పోగొట్టిందా?"

"నాకు ఒంటిరితనం ఎక్కడిది? అమ్మానాన్నా, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వాళ్ళ పిల్లలు అంతా నా వాళ్ళే."

"పక్షి రెక్కలు అందంగా ఉంటాయని బంగారంతో పొదిగావంటే అది మళ్ళీ ఎప్పటికీ ఎగరలేదు. అలాగే నీ కర్తవ్యంలోనే నువ్వు ఆనందాన్ని వెదుక్కుంటూంటే కొంత కాలానికి నీ కర్తవ్యమే నీ పాలిట విషాదంగా మారగలదు."

జానకి మౌనంగా ఎటో చూడ సాగింది.

"చాలా కటువుగా అన్పించినా ఓ సత్యం చెప్పనా! ఈ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలే. నిన్ను నిన్నుగా ప్రేమించే తోడు నీ కోనాడు అవసరమౌతుంది. ఆనాడు నువ్వెంత ఆరాటపడ్డా నీ కది దొరకదు. నామాటవిని, రఘుగారిని పెళ్ళి చేసుకో"

"ఈ వయసులో నాకిప్పుడు పెళ్ళేమిటి?" చిరాగ్గా అంది జానకి.

"ముప్ఫై ఏళ్ళు నీకు దాటాయంటే ఎవరూ నమ్మరు. ఆ కళ్ళ జోడు తీసెయ్యి. ఇప్పుడే కాలేజీకి వెళ్ళే అమ్మాయిలా ఉంటావ్. జానకి ఆంటీ అంత స్మార్ట్‌గా మా కాలేజీలో ఎవరూ ఉండరు అంటుంది నా కూతురు తెలుసా!"

"చాల్లే ఊరుకో! స్టూడెంట్స్‌కి లెక్చరర్ల పట్ల అభిమానం వుంటుంది. చిన్న పిల్ల మాటలు పట్టుకొని, పెళ్ళి చేసుకోమంటావేమిటి?"

"పోనీ... రఘు గురించి ఆలోచించు. ఆనాడు నువ్వు పెళ్ళి చూపుల క్కూడా ఇష్టపడక పోయినా, నిన్ను మా ఇంట్లో చూసి ఎంతో ఇష్టపడ్డాడు. నీ తిరస్కారం అతని మనసు నెంత గాయపరిచిందో నీకు తెలియదు. సివిల్ ఇంజనీరు. ఆడపిల్లల తండ్రులు క్యూలో నించుంటారు తెలుసా అతను చేసుకుంటానంటే! అయినా ఈ రోజుకీ పెళ్ళి చేసుకోలేదు. నిన్ను మరిచి పోలేట్ట"

జానకి ఏం మాట్లాడలేదు. చివరికి "సారీ! లల్లీ!" అనేసి బైటికొచ్చేసింది. జరిగిన సంఘటనలు ఓసారి కదిల్చి పోయాయి. జానకి లేచి నిద్ర మాత్ర వేసుకొని పడుకొంది.

రోజులు గడుస్తున్నాయి.

రమ ప్రసవించింది. పురుడు, ఖర్చులు. చిన్న తమ్ముడి ఉద్యోగానికి లంచం, పదిహేను వేలు లోన్ తీసుకొంది. రెండు వందలు ఖర్చులకుంచుకొని మిగతా జీతం తండ్రికిస్తోంది. అదీ చాలక సాయంకాలం కాలేజీ వదిలాక, నలుగురు స్టూడెంట్స్‌కి ట్యూషన్ చెప్తోంది. ఇంత చేసినా ఇంకా తనేదో దాచుకుంటోందని కాత్యా సూటి పోటి మాటలు. ఉద్యోగం చేసే తను కాస్తమంచి చీర కట్టుకోక పోతే ఎలా? చీరె కొనుక్కుంటే చాలు! ఆ

## విచిత్రమైన చివరికోరిక

రెండో ప్రపంచయుద్ధం సమయంలోని మరణ శిక్ష విధించబడిన ఒక జర్మన్ ఖైదీ తన విచిత్రమైన చివరికోరిక కారణంగా రక్షించబడ్డాడు. అతని పేరు ఎపిలేన్‌వాన్ గేలింజన్. జర్మనీ, దేశద్రోహిగా అతన్ని నిందించింది. అందుచేత నాజీలు అతనికి మరణ శిక్ష విధించారు. నన్‌వర్గ్ (జర్మనీ) కొండల లోయలో అతనికి మరణ శిక్ష అమలుజరపాలి. చివరికోరిక ఏమిటని అడిగినప్పుడు, తన ప్రియమైన గుర్రం మీద కూర్చునే కోరిక తీర్చమని అన్నాడు గేలింజన్. కేవలం కూర్చోవటమే అతను అడిగింది. దగ్గిరలోనే అతని గుర్రం కట్టివేయబడివుంది.

చివరికోరిక తీర్చాలి కాబట్టి గుర్రం మీద కూర్చునేందుకు అనుమతి ఇవ్వబడింది. గుర్రం మీద కూర్చుని అతను ఒకసారి పరిసరాలు పరికించాడు. గుర్రాలమీద పెద్ద రెజిమెంటు చుట్టూ నిలబడి ఉంది. చాలా గట్టి కాపలా! అయినా భయపడలేదు. గుర్రాన్ని అదిలించాడు. నగరం వైపు దారి తీయించాడు. వెనుకనున్నగుర్రాలరౌతులు విషయం గ్రహించేలోపల ఒక పెద్ద లోయదగ్గర పర్వతచరియని చేరుకున్నాడు. వెనుక సైన్యం వస్తూంది. లెక్క చేయకుండా గుర్రంతో లోయలోకి దూకేశాడు. సైనికులు చూస్తూ ఆశ్చర్యపోయారు. లోయలోకి దూకి బ్రతికాడు. శిక్ష తప్పించుకుని, ప్రాణాలు కాపాడుకున్నాడు.

రోజంతా కాత్యా సాధిస్తూనే ఉంటుంది.

చిన్న చెల్లెలి పెళ్ళి చెయ్యాలని, లోన్ తీసుకోమంటున్నాడు తండ్రి. ఇప్పటికే తన జీతంలో కటింగ్స్ ఎక్కువ. పురుళ్ళు పెళ్లీళ్ళు బంధువుల రాక పోకలు పెట్టు పోతలు ప్రయాణాలు. వీటన్నింటికి డబ్బు తనెక్కణ్ణించి తెచ్చిస్తోంది. ఎవరికీ పట్టదు. ఆఫీసులో లోన్లు తీసుకొని అవన్నీ దాటించింది. అన్నీ కట్టాల్సినవే. చాలక ట్యూషన్లు చెప్తోంది. ఇంకా ఏదో చెయ్యలేదని, ఇవ్వలేదని సాధింపులు,..

జానకికి తల బద్దలౌతున్న భావన...

కాలేజీలో నాల్గు పీరియళ్ళు చెప్పి, బైటి కొచ్చి రెండు గంటలు ట్యూషన్లు చెప్పేసరికి... నీరసం... పొడిదగ్గు పట్టుకున్నాయి.

కాత్యా పిల్లని దగ్గరికి రానీటం లేదు.

"ఊరికే దగ్గుతోంది. అలా పోకమ్మా నీకూ పట్టుకుంటుంది. కూతుర్ని రానివ్వకుండా చూస్తోంది.

"పోయేటప్పుడు కట్టుకుపోతుందా! ఆట్యూషన్ల డబ్బులు ఏం చేస్తుందో! వియ్యపురాలికి చీరెపెట్టాలంటే కోపం, నే నెళ్ళినప్పుడు వాళ్ళు పెట్టటం లేదూ! మనం పెట్టకపోతే ఏం బావుంటుంది?"

కంచంలో అన్నం పెడ్తూ అంటోంది పార్వతమ్మ

గుండెల్లో పదునైంది ఏదో దిగబడ్డట్లైంది జానక్కి.

"ఇదిగో అన్నం పెట్టా! తిను" తల్లి పిలుపది ఇప్పుడు.

"జానకీ! అన్నం చల్లారుతోంది తల్లీ, త్వరగా రా!" అని పిలిచే తల్లి ప్రేమ ఏమయిందిప్పుడు?

ఆ అన్నం తినక పోతేనేం? అన్పించి, గ్లాసు నీళ్ళు తాగి వచ్చేసింది.

యాత్రలకి డబ్బులేదందని తండ్రి అలిగి, మాట్లాట్టం తగ్గించేశాడు.

జానకి మంచం మీద తూలినట్లుగా పడుకొంది.

ఇంట్లో ఎవరూ ఆప్యాయంగా మాట్లాట్టం లేదు. అంతా ముభావం, మౌనం.

హాల్లో టి.వి. ముందు కూర్చొని.. కబుర్లు చెప్పుకుంటూ నవ్వుతున్నారంతా.

అదే ఇంట్లో మరో మనిషి.. తమ కోసం అహర్నిశలు కష్టించే మనిషి అనారోగ్యంతో, ఆకలితో, పడుకొందని పలకరించేందుక్కూడా వారికి మనసు రాలేదు.

మర్నాడు ఆమె పరిస్థితి తెలుసుకొని లలిత బలవంతంగా డాక్టర్ దగ్గరికి తీస్కెళ్ళింది.

"ఇప్పుడు డాక్టరూ ఈ ఖర్చంతా దేనికి? వేడి చేసుంటుంది" విసుక్కొంది జానకి.

"నోర్మూయ్? రోజు రోజుకి బాగా చిక్కి పోతున్నావ్. బాగా దగ్గుతున్నావని పాపావాళ్ళు చెబ్తూనే ఉన్నారు. మొన్న క్లాసులో పడిపోయావుట"

"కళ్ళు తిరిగాయి ఆ మాత్రానికేనా ఈ హడావుడి.' లలిత ఫామిలీ డాక్టర్ దగ్గరికి తీస్కెళ్ళింది. డాక్టరు పరీక్షలు చేసి.- "మీరా ఉద్యోగం మానెయ్యండి. మీకు విశ్రాంతి బాగా అవసరం, మీకు టి.బి" అన్నాడు. జానకి గుండెల్లో రాయిపడింది. టి.బి. గురించి కాదు. ఉద్యోగం మానేస్తే ఇల్లు గడిచేదెలా?

ఈ సంగతి విని ఇంట్లో వారంతా నిశ్చేష్టులయ్యారు. జానకి గది దాటి ఎక్కువగా బైటకి రావటం లేదు. నెలగడిచింది. నెలకాగానే ఇవ్వాల్సిన వాళ్ళంతా ఇంటి చుట్టూ తిరిగి పోతున్నారు.

"నీ ప్రావిడెంట్ ఫండ్ అదీ..." ఆగాడు తండ్రి

"నేను తీసుకొన్న లోన్లకి అది సరిపోయింది నాన్నా! నాకింకేమీ రాదు" అందామె.

తండ్రి మొహం మాడ్చుకొని బైటికెళ్ళి పోయాడు..

ఇంట్లో చాలా మార్పులొచ్చేశాయి. పెద్ద తమ్ముడు శ్రమ పడి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. చిన్నాడు పార్ట్ టైం జాబ్ చేస్తున్నాడు. పెద్ద చెల్లెలు గునుస్తూ అత్తగారింటికెళ్ళి పోయింది. తండ్రి సాయంకాలాలు ఇరుగు పొరుగుతో కాలక్షేపం చేయక పది మంది పిల్లలకి ట్యూషన్లు చెబ్తున్నాడు. చిన్న చెల్లెలు తండ్రికి సాయపడ్తూ చదువు కుంటోంది కాత్యాయని మూల పడేసిన మిషన్ తీసి బాగు చేయించుకొని చుట్టు పక్కల వాళ్ళకి జాకెట్లు లంగాలు కుట్టి డబ్బు సంపాదిస్తోంది. అంతా డబ్బు సంపాదనలో పడ్డారు. జానకి ఉనికి వారికిప్పుడు భరించ రానిదిగా వుంది. ఏ హాస్పిటల్‌లో చేర్పిం చాలా, తక్కువ ఖర్చు ఎక్కడవుతుందీ అని ఎంక్వయిరీ చేస్తున్నారు. జానకిని చూట్టానికి గాని, ఆమెక్కావల్సిన మందులు కొంటానిక్కాని వారికిప్పుడు తీరుబాటులేదు.

ఒంటరితనం..... అనారోగ్యం...... పీక్కుతింటున్నాయి జానకిని. లలిత చూట్టానికొచ్చేసరికి నిస్త్రాణగా, స్పృహ లేని దాన్లా పడుందామె. ఆటోలో తీసుకొచ్చేసింది లలిత. చాలా సేపటికి.... రోజులా... గంటలా.. ఏమో స్పృహ వచ్చింది జానక్కి. మత్తుగా వుండి కళ్ళు తెరిపిన పడనంటున్నాయి.

తనెంత ఒంటరిది? ఎంతనరకం చూసింది!

"లల్లీ! నువ్వు... నువ్వు చెప్పింది నిజం. చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నిజంగా మూర్ఖురాలినే నన్నందరూ ఎలా వదిలేశారో చూశావా! నాకిప్పుడెవరూ లేరు.... నే నెవరికీ అక్కర్లేదు"

ఆమె మాటలు గద్గదికంగా వస్తున్నాయి. చెంపల పక్కగా నీరు జారుతోంది. ఎవరో తనని ఒడిలోకి తీసుకున్నారు. కన్నీరు తుడిచారు. బలమైన చేతులు తనని చుట్టుకొని సున్నితంగా గుండెకి హత్తుకున్నాయి.

లలిత... కాదు... కాదు.. ఎవరు? ఎవరు!

పెనుగు లాడటానికి ప్రయత్నించింది. ఓపిక లేక.. మెల్లిగా కళ్ళు తెరిచింది. "ఎవరూ?" అంది భయంగా చూస్తూ

"థాంక్ గాడ్! కళ్ళు తెరిచావ్!" అంటూన్న మృదుగంభీరమైన కంఠం అతిసమీపంలో.

"నేను రఘుని. భయపడకు" దగ్గరగా వంగిన ఆ మొహంలో నుండి వచ్చిన మాటవిని....

జానకిలో ఆశ్చర్యం... సంభ్రమం.. భయం... సంకోచం.... వెరపు...

"మీరు.. మీరిలా.. నేనిక్కడికి.. ఇదేమిటి?" అతని చేతులు తొలగించుకొని లేవాలని... అతనా ప్రయత్నం సాగనివ్వలేదు.

"లలిత నిన్ను నా ఇంట్లో దించి పదిరోజులైంది."

"మీ ఇల్లా?" అప్పుడు చూసింది కళ్ళతో ఆ గదిని... అధునాతన సౌకర్యాలతో అందంగా విశాలంగా వున్న ఆగది....

"నేనే రప్పించుకున్నాను నిన్ను"


అతనామె మొహంలోని ప్రశ్న చదివి జవాబిచ్చాడు.

"ఎందుకు?"

నీరసంగా వున్న ఆమె కనురెప్పల తడిని సున్నితంగా తుడుస్తూ

"నీకు నేనున్నానని చెబుదామని" అన్నాడు.

రాత్రి వచ్చిన తుఫాను మరునాటి ఉదయాన్ని బంగారు కాంతులతో అలంకరించింది! జానకి జీవితం ఆ బంగారు కాంతులతో నిండిపోయింది.



మనకు పెళ్ళంటే తలంబ్రాలు, సన్నాయి వాయిద్యం, అర్థం అయినా కాకపోయినా పురోహితుడి మంత్రాలు, బంధువుల సందడి, కట్నాల కానుకల పేచీ. ఈ తతంగానికి తరతరాలుగా అలవాటుపడి జీర్ణించుకుపోయిన మనస్థత్వం మనది. నూటికి తొంభై మంది డబ్బు లేకపోతే అప్పుజేసి అయినా, ఈ తతంగం జరిపించి తర్వాత ఎన్ని బాధలన్నా పడతారు గానీ, చెయ్యకుండా మాత్రం ఊరుకోరు. రానురాను ఈ పెళ్ళి ముచ్చట మోయలేని భారంగా తయారవుతున్నా ఎవరూ మారరు. ఎందుకంటే మనవారిలో నూటికి తొంభై మందికి కొత్త మార్గం తొక్కాలంటే హడలు. మనం వేరు హేమా. మనది కొత్త తరం. పెళ్ళి అనే దానికి వధూవరుల మనసుల కలయికకు ప్రాధాన్యం వుండాలి కాని వేడుకలకీ - ఆడంబరాలకీ అవకాశం కాకూడదు. మనం చిన్న పిల్లలం గాదు. పెద్దలు వాళ్ళు మారకపోతే మారి చూపించాల్సిన బాధ్యత మనమీద ఉంది.

- యద్దనపూడి సులోచనారాణి

('ఈ తరం కథ'లో హేమతో రమేష్)